క్లుప్తంగా

11న మండల సమావేశం

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 11వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు విధిగా రికార్డులతో హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ప్రజాప్రతినిధులకు దీనిపై సమాచారం ఇచ్చామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

ముంచంగిపుట్టు: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బైక్ మెకానిక్ పాంగి అమర్ కుటుంబానికి స్థానికదుర్గమ్మ తల్లి ఆలయ వర్కింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. కటుంబానికి ప్రగఢ సానూభుతి తెలిపారు.కమిటీ తరపున రూ.5200 ఆర్థిక సాయమందించారు.కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్, కమిటీ సభ్యుడు సుభాష్‌చంద్ర, ఆలయ వర్కింగ్ కమిటీ సభ్యులు ప్రసాద్‌రావు పడాల్, మధుసూదన్, మత్స్యలింగం, ప్రభాకర్, బాబూరావు, నాగరాజు, నాగమణి పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో కుడుమసారిలో గడప గడపకు

చింతపల్లిరూరల్: మండలంలో కుడుమసారి సచివాలయ పరిధిలో సోమవారం, మంగళవారం రెండు రోజులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. సర్పంచులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఆకట్టుకున్న కోలాటం


కోలాట ప్రదర్శనలో చిన్నారులు

రాజవొమ్మంగి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం రాత్రి నిర్వహించిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య కళా ప్రతిభను స్థానికులు అభినందించారు.

రికవరీ వ్యాన్‌తో లారీ తరలింపు


మైదాన ప్రాంతానికి రికవరీ వ్యాన్‌తో తరలిస్తున్న లారీ

అనంతగిరి: ఘాట్‌రోడ్డులోని హెయిర్ పిన్‌బెండ్- 2 మలుపు సమీపంలోని రోడ్డుకు మధ్యలో నిలిచిపోయిన లారీని శుక్రవారం రికవరీ వ్యాన్‌తో మైదాన ప్రాంతానికి తరలించారు. అరకులోయ వైపుగా వెళుతున్న లారీ ఇంజన్‌లో సాంకేతిక సమస్య కారణంగా రోడ్డుకు మధ్యలో నిలిచిపోయింది. అయితే వాహనాలు వెళ్లేందుకు, ఇరువైపులా స్థలం ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదు. పెద్ద వాహనాలు వెళ్లేందుకు కొంత ఇబ్బందులు ఏర్పడింది.

సమస్యల పరిష్కారానికి రిలే దీక్షలు

పాడేరు రూరల్: స్థానిక గిరిజన భవన్‌లో ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రతినిధులు శేషాద్రి, సింహాచలం మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 11 నుంచి ఐటీడీఏ గేటు వద్ద రిలే దీక్షలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆదివాసీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై, జీవో నెంబర్-3 రద్దు కోసం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. నాయకులు కొండలరావు, ఈశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు రామారావుదొర, గంగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి


నిమ్మలగొంధిలో పర్యటిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నేతలు


టీపీ వీడు గ్రామంలో సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

కొయ్యూరు: ఏజెన్సీలోని శివారు గ్రామాల్లోనూ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మర్రివాడ పంచాయతీ నిమ్మలగొంది గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో 254 గడపలను ఆమె సందర్శించారు. తమ గ్రామానికి నేటి వరకు ఏ ప్రజాప్రతినిధి రాలేదని, నేడు ఎమ్మెల్యే రావడం చాలా ఆనందంగా ఉందని స్థానికులు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో , రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. రోడ్డు కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. పాడేరు నియోజకవర్గం ఐదు మండలాల్లో రూ.75 కోట్లతో జీఎస్‌పీ రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఉపాధి హామీ నిధులతో రోడ్లను వేస్తున్నామన్నారు. త్వరలో చాలా రోడ్ల పనులు ప్రారంభిస్తామన్నారు.ఎద్దుమామిడి నుంచి టెంకల పనుకులకు అనుసంధానం చేస్తామన్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులకు అటవీ శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.అన్నిచోట్ల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలను సందర్శించారు.విద్యార్థులతో మాట్లాడారు.తల్లిదండ్రులు పిల్లలను ప్రతీరోజు పాఠశాలకు పంపాలని సూచించారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, సర్పంచ్‌లు ఎం.సత్యవతి, చిన్నారావు, రామకృష్ణ, చంద్రరావు, గూడెంకొత్తవీధి వైస్ ఎంపీపీ ఆనంద్, జిల్లా పార్టీ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గిరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.సూరిబాబు, మండల కన్వీనర్ సుధాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, వైస్ సర్పంచ్ మూర్తి, నేతలు రామారావు, తాతారావు, గణపతి, సింహాచలం, ఆనంద్, దేముడు, దుర్గో, సాంభమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలే అర్హతగా సంక్షేమ పథకాల అమలు

ఎటపాక: అర్హులైన ప్రతీ పేదవానికి సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత మన ప్రభుత్వం దేనని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. నెల్లిపాకలో శుక్రవారం కొత్త పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 417 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎన్.టి.ఆర్.కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి సాధించామన్నారు. టీపీ వీడు సచివాలయం పరిధిలో రూ.18కోట్లతో వివిద పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసినట్టు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదలను చిత్ర హింసలు పెట్టారని లంచాల పేరుతో దోచుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి జరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, సొసైటీ చైర్మన్ ఆకుల వెంకట రామారావు, సర్పంచ్ దుర్గాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బి.అంజలి, పార్టీ మండల కన్వీనర్ టి.వాసు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, నాయకులు అప్పలరెడ్డి, పాపారావు, ప్రసాద్, కన్న , నరేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి


బొంగరంలో పోషకాహార ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరి

పెదబయలు/చింతపల్లి రూరల్/రంపచోడవరం: జిల్లాలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా పెదబయలు, చింతపల్లి, రంపచోడవరం అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత ఐసీడీఎస్ సీడీపీవోలు రాజేశ్వరి, రమణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు రోజూ తాజా పండ్లు, ఆకుకూరలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. కొర్రలు, సామలు, రాగుల వినియోగంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని, రక్తహీనత లేకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలన్నారు. ప్రీస్కూల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. నాయకుడు గణబాబు, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు సరస్వతి, విజయకుమారి, పెదగెడ్డం సర్పంచ్ వడగల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై అపరాల విత్తనాలు


రైతులకు అపరాల విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

వై.రామవరం: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 800 మంది రైతులకు 90 శాతం సబ్సిడీపై అపరాల విత్తనాలను ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ ముత్యాల నూకరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న అపరాల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సీఎం జగనన్న ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేశారన్నారు. ఏవో ఉషారాణి మాట్లాడుతూ ఈ ఏడాది 118.7 క్వింటాళ్ల మినుములు, 37.14 క్వింటాళ్ల పెసలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామన్నారు. ఆర్‌బీకేల్లో ప్రభుత్వం అందించిన సబ్సిడీపై ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ సత్యవతి అధ్యక్షతన గురువారం గర్భిణులకు ఘనంగా సీమంతాలు చేశారు. ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు ఆరోగ్యభద్రతపై పలు సూచనలిచ్చారు. మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


కొర్రా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నాయకులు

దుంబ్రిగూడ: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకొని తద్వారా పరిష్కరించేందుకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు విజయ, సర్పంచ్ అర్జున్, మండల కన్వీనర్ గణపతి, నాయకులు చిరంజీవి, సింహాచలం, కృష్ణారావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి



సమావేశాల్లో మాట్లాడుతున్న ఎంపీడీవోలు ఉమామహేశ్వరరావు, బాపన్నదొర

గూడెంకొత్తవీధి/అడ్డతీగల: జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని జీకే వీధి, అడ్డతీగల ఎంపీడీవోలు ఉమామహేశ్వరరావు, కె.బాపన్నదొర చెప్పారు. జీకే వీధి, అడ్డతీగల ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారి వివరాలు సేకరించి, ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి, వైదపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో రెండు బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. తహసీల్దార్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి


మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు గాసి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. పార్టీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి, ఎమ్మెల్యే పాల్గుణ, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, నాయకులు నర్సింగ్, రాజ్‌కుమార్, అర్జున్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న ప్రత్యేక వైద్య శిబిరం

రంపచోడవరం: రంపచోడవరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఈ నెల 10న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞాయానందజీ తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులు, ఆయాసం, దడ, బిపి, షుగర్, చెవి,ముక్కు, గొంతు, ఎముకల, ఫిట్స్ , చర్మ వ్యాధులు, స్త్రీ వ్యాధులు, పిల్లల వ్యాధులు, సామాన్య రోగాలకు వైద్య సేవలు లభిస్తాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించే శిబిరంలో వైద్య నిపుణుల ద్వారా వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఏజెన్సీ వాసుల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరమహంస యోగానంద నేత్రాలయం, వేమగిరి ఆధ్వర్యంలో కంటి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

10న ఉపకార వేతనాలకు అర్హత పరీక్ష

మాడుగుల రూరల్: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఉన్నత చదువుకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సమన్వయ కర్త కె.జానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 250 మందికి స్కాలర్ షిప్ అందించేందుకు ఈ నెల 10న ఉదయం 9 గంటలకు వీరవల్లి అగ్రహారం పెట్రోల్‌బంక్ సమీపంలో సంస్థ కార్యాలయంలో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 7989947349 సంప్రదించాలన్నారు.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు


జి.మాడుగుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి


దేవీపట్నంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మురళి

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఎంపీపీ కొర్రా పద్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజావసర నిర్మాణాలు త్వరితగతిన చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావటానికి మండల స్థాయి అధికారులు సహకరించాలన్నారు. సమావేశంలో మండల పరిధిలో పలుచోట్ల పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులు, అమలుకాని మెనూ, ఉపాధ్యాయుల నియామకం, పాఠశాలల ఏర్పాటు తదితర సమస్యలను సభ్యులు తెలియజేశారు. దీనిపై ఎంఈవో బాబూరావు పడాల్, ఏటీడబ్ల్యూవో తిరుపాల్ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జల్‌జీవన్ పనులు త్వరగా చేయాలని సభ్యులు కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ స్పందించి, గడువులోగా పూర్తిచేస్తామన్నారు. స్థానికంగా గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేయాలని పలువురు తెలియజేశారు. విశాఖ-జి.మాడుగుల నైట్‌హాల్ట్ బస్సు, పాడేరు-లోతుగెడ్డ, నర్సీపట్నం, అన్నవరం-పోతురాజుగుమ్మల, సొలభం, గడుతూరు, సంగులోయ బస్సు సర్వీసుల కోసం ఆర్టీసీ చార్ట్ కంట్రోలర్ రమణను సభ్యులు కోరారు. ఎంపీటీసీ సభ్యులు సన్యాసిదొర, విజకుమారి, సర్పంచ్‌లు కొండబాబు, రామకృష్ణ, రాంబాబు, హనుమంతరావు, ఎంపీటీసీలు విజయకుమారి, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, తహసీల్దార్ కెఅప్పలస్వామి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కళ్యాణి, ఏవో పాత్రుడు,పీఆర్ ఏఈ మాణిక్యం, విద్యుత్ శాఖ ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

దేవీపట్నం: ఇందుకూరుపేటలో ఎంపీపీ కుంజం మురళి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించారు. ఎంపీపీ మురళి మాట్లాడుతూ పునరావాస కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రతి కాలనీలో ఆర్వో ప్లాంటు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ములకల గూడెం నుంచి డిఎన్‌పాలెం రహదారిలో అవసరమైన చోట్ల 400 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. సమావేశానికి హాజరుకాని పలు శాఖల అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీవో రత్నకుమారి, డీటీ రామకృష్ణ, నేతలు బాబ్జి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రింతాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు

గూడెంకొత్తవీధి: రింతాడలో శుక్రవారం గూడెం వైద్యులు వినయ్‌కుమార్ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని పరీక్షించారు. బీపీ, మధుమేహ రోగులకు సలహాలిచ్చారు. రక్తహీనత ఉన్నవారు విధిగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని లేక వైద్యుల సూచనల మేరకు ఆస్పత్రిలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు చేయించుకోవాలని కోరారు. మరగబెట్టిన నీటిని తాగాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కొందరు నడచి వచ్చే అవకాశం లేకపోవడంతో వారి ఇళ్లకు వెళ్లి ఆయన పరీక్షించారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

నేడు రుద్ర హోమం

మాకవరపాలెం: ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు దొరాబాబుశర్మ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

పశువులకు లంపీ స్కిన్ వ్యాక్సిన్


బిల్లాపుట్టులో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: పశువులకు లంపి స్కిన్ వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని పశుసంవర్థక శాఖ వైద్యుడు గౌతమ్ అన్నారు. పోతంగి పంచాయతీ బిల్లాపుట్టు గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 318 పశువులకు లంపి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశువుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పశువుల శాలను పొడిగా ఉంచాలన్నారు. తడి నేలలో పశువులు, గొర్రెలు, మేకలను ఉంచవద్దని సూచించారు. కాలానికి అనుగుణంగా పశువులకు వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధులు రాకుండా జాగ్రత ఉంటుందన్నారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది త్రినాథ్‌రావు, రాజు, సంజీవ్, జానకి, రత్నం, అనంత్‌రావు, అప్పారావు, మహేష్, మనోజ్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మకు శ్రావణ పూజలు


కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తులు

అనకాపల్లిటౌన్: శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ కల్యాణగిరిపై వేంచేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు, ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, కార్యదర్శి బోయిన రమణాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శిలపరశెట్టి బాబి, బోడపాటి చిన్న రాజారావు, దొడ్డి రమణ, రమణబాబు, రేబాక ఇంద్రకుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

కశింకోట:కశింకోటలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం 4వ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయం, జాతీయ రహదారి వద్ద కనకదుర్గ, గవరపేటలోని కనకమహాలక్ష్మి, వేంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చనలు నిర్వహించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులకు అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతకు ధ్రువపత్రాలతో పాటు దరఖాస్తులను ఈ నెల 16 లోగా కళాశాలలో అందజేయాలన్నారు. జీఎఫ్‌సీ అధ్యాపక పోస్టుకు ఎంఏ ఎకనామిక్స్‌లో, సీఎస్ఈ పోస్టుకు బీటెక్/ఎంఎస్‌సీ, కంప్యూటర్ సైన్స్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఫిజియోథెరపీ(పీటీ) వొకేషన్ అధ్యాపక పోస్టుకు బీపీటీ/ఎంపీటీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.

నేటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

కశింకోట: స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి భగవద్గీత ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం పూట ప్రవచన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. భగవద్గీత ప్రాధాన్యత, నిత్య జీవితంలో దాని ఉపయోగం తదితర అంశాలను ప్రముఖులు వివరిస్తారని తెలిపారు. భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు.